# మిసిమి

చింతనాత్మక సారస్వతం



ఎలీసబత్ విజీ లే బ్రాన్

మాసపత్రిక, ఫిబ్రవరి, 2021 ₹ 30/-

ISSN 2454–4329

# లఘుకావ్యం అక్షరాంజలి

– రాయవరపు సత్యనారాయణ

"... కాంతి సంవత్సరాల దూరాలకు విస్తరిస్తున్న విశాలవిశ్వం, కంటికి కనబడనంత చిన్నదైన వింతల 'క్వాంటం' కనికట్టులా నన్ను కవ్విస్తూనే ఉన్నాయి. సృష్టికర్త ప్రేరణతోనే సృష్టిలోని విశేషాలనీ, వింతలనీ సృష్టికర్తకు విన్నవించుకునే ప్రయత్నం" అంటూ డా. ఎ.ఎస్. రామశాస్త్రిగారు (కలం పేరు 'అనామకుడు') 'అక్షరాంజలి' కావ్యరచనను మొదలుపెట్టారు. ఆరు దవాబ్దాల పాటు అంతర్ముఖంగా విశ్వవైచిత్రిని ఆరాధనా భావంతో దర్శించి, తరచి చూచి, విస్మయం చెంది తద్వారా ఉత్పన్నమయిన తన భావాలను కావ్యఖండికగా 'అక్షరాంజలి'ని ఆవిష్కరించారు. పరమేష్టికి పద్యమాలగా సమర్పించారు.

అరవై పద్యాలను 'ఆత్మనివేదన - నీ వినోదం - మా సందేహం - నీ విలాసం - సనాతన విజ్ఞానం - నా విన్నపం' అనే విభాగాలుగా పొందుపరిచారు. 'వేల సంవత్సరాల తరువాత, మనం విజ్ఞానపరంగా ఎంతో ముందుకు సాగిన తర్వాత కూడా మాన్య మహర్షులు వేసుకొన్న ప్రశ్నలు, సంబంధించిన సమాధానాలు మనలను ఆలోచింపజేస్తాయని' వాటికి నేటికున్న ప్రాధాన్యతను 'ఉపనిషత్తులు' విభాగం ప్రస్తావించారు. పద్యాలలో పొదగబడిన సాంకేతిక పదాల సాధికారిక వివరణలను 'అనుబంధం' విభాగంలో ఆంగ్ల భాషలో ప్రస్తావించారు.

ఈ పద్యాలను దేశీమార్గ ఛందస్సులలో ఉత్పల మాలలుగా, సరళసీసములుగా అందమయిన కందాలుగా డా. రామశాస్త్రిగారు రచన చేశారు.

**అక్షరాంజలిలోకి ప్రవేశిద్దాం:**

***ఆటను సృష్టి చేసి నియమావళి సర్వము నిర్ణయించి మ***
***మ్మాటల నాడనిచ్చెదవు – అంతియెగాక జయించనిచ్చి ఆ***
***బూటకమైన గెల్పునకు పొంగెడు మాపయిజాలితోడ – ఏ***
***నాటికొ మాకు తెల్పెదవు – నాటకమంతయు నీదికేళిగాన్***

ఆ జగన్నాటక సూత్రధారి మాయలోపడి జయాలు మన ప్రతిభ అన్న భ్రమలో పడవేసి, జాలిగా మనల్ని ఆ మాయనుంచి బయటపడేట్టు భగవంతుడు చేసే వైచిత్రిని 'నీ వినోదం' అనే విభాగంలో మనసుకు హత్తుకొనే విధంగా రచయిత చెప్పారు. 'నీ విలాసం'లో ఖగోళ, భౌతిక, జన్యు ఇత్యాది శాస్త్రాల క్లిష్ట సాంకేతిక విషయాలను పదకొండు పద్యాలలో సరళ శైలిలో ఆవిష్కరించిన తీరు పాఠకులను అబ్బురపరుస్తుంది. మచ్చుకు:

***కంటికి కానరానిదగు 'క్వాంటము'ను నందునవింతలెన్నియో,***
***క్వాంటకణంబులొక్క పరికన్నదునంటతరంగమట్లుగా***
***జంటగ కొల్వజాలమట స్థానమువేగము ఒక్కసారిగా***
***తుంటరివందునానిను? అతుల్యపు విశ్వసృష్టిచేసెడున్***

ఈ పద్యానికి స్ఫూర్తి నోబెల్ విజేతలు ఐన్‌స్టీన్ - మాక్స్‌ప్లాంక్‌లు కనుగొన్న 'క్వాంటం భౌతికశాస్త్ర' మూలసూత్రం. కాస్త వివరంగా చెప్పాలంటే మన చర్మ చక్షువులకు కనిపించే పదార్థం ఘనరూపకణమా? లేక తరంగమా? ఇవి చిక్కు ప్రశ్నలు. ఆ మేధావులు ప్రతిపాదించిన దాని ప్రకారం ఈ రెండు స్థితులు వాస్తవమే. తరంగ స్థితిని మనోనేత్రంతో ఊహించకొనవలసినదే. వీటిని సమన్వయం చేసి ఆలోకేశుని 'తుంటరి' అంటూ సంబోధిస్తూ రమ్యంగా రచయిత ఆటపట్టించిన తీరు ఆలోచనాత్మకంగా, ప్రశంసనీయంగా ఉంది.

వైజ్ఞానిక ప్రపంచం విస్తరిస్తూనే ఉంటుంది. అనునిత్యం ఎన్నో ప్రాథమిక సత్యాలు వెలుగులోకి వస్తూంటాయి. ఇది నిరంతర పరిణామం. తరచి చూస్తే ఆధునిక, సనాతన విజ్ఞానాల మధ్య ఎంతో అవినాభావ సంబంధం కనిపిస్తుంది. ఈ దిశగా 'సనాతన విజ్ఞానం' అన్న విభాగంలో 'పూర్ణ - ఈశ, బ్రహ్మము - ఓంకారం - అమంబ్రహ్మాస్మి - నిరాకారం - అద్వైతం - పరమపద

సోపానం - విశ్వరూపం - యజ్ఞ - యోగమార్గం - కోపం' అన్న శీర్షికలతో, సరళ సీస / కంద పద్యాల ద్వారా జ్ఞానామృతాన్ని ఆస్వాదింపజేశాయి. ఒక ఆణిముత్యం:

***పూర్ణంబిది పూర్ణంబిది / పూర్ణంబుదయించుచుండు పూర్ణమునందున్***
***పూర్ణంబు తొలగించిన / పూర్ణంబును – మిగిలియుండు పూర్ణంబంతన్***

పూర్ణం గురించి అందమయిన కంద పద్యంలో గణితశాస్త్ర సమ్మితంగా నిర్వచించిన తీరును మెచ్చుకోకుండా ఉండలేము.

'సనాతన విజ్ఞానం'లో ఓంకారం విశిష్టతను గురించి చెప్పిన పద్యంలో ఒక సృష్టి రహస్యాన్ని నిక్షిప్తం చేశారు.

***అదియెసకలార్థక సృష్టికి ఆదియు తుదియు***
***అదియె జగతికి ఆధారమనవరతము***
***అదియె ఓంకారనాదంబు – ఆదిలేదు***
***అదియె ఓంకారనాదంబు – అంతమవదు***

ఈ పద్యంలో ఐన్‌స్టీన్ $E=me^2$ విఖ్యాత సమీకరణంలోని విడదీయలేని 'పదార్థ-శక్తి' సంబంధాన్ని సూచనాత్మకంగా కవి ఆవిష్కరణ చేశారు. 'అక్షరాంజలి' లఘుకావ్య పరిణామంలో యాదృచ్ఛికంగా విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన పరమ నిగూఢ సత్యాలను పద్యరూపంలో ప్రామాణికతతో వివరణ చేయటం అరుదైన ప్రయోగం. ఎక్కువగా వచన కవితలు వెల్లువవుతున్న ఈ రోజులలో సాంప్రదాయ ఛందోబద్ధంగా వాస్తవికతా ప్రాధాన్యంగా పద్యరచన చేసి మెప్పించడంలో డా. రామశాస్త్రిగారు విజయం సాధించారు. పోతనామాత్యుని మకరంద పద్యశైలిలో సమాస, పదభూయిష్టం లేకుండా రచించిన తీరు పఠితల మనస్సును హత్తుకొంటుందనటంలో సందేహం లేదు. ఆరు దశాబ్దాల క్రితం డా. వసంతరావు వేంకటరావుగారు వైజ్ఞానిక విషయాలు పై వ్యాసాలు పద్యాలు రచన చేశారు. ఆ తర్వాత కాలంలో సైన్సుకు సంబంధించిన వ్యాసాలు, పుస్తకాలు ఎన్నో వచ్చాయి. ఈ మధ్యకాలంలో ఇటువంటి విలక్షణ పద్యరచన నా పరిమిత పఠనంలో తారసపడలేదు (విజ్ఞులు సవరించమని నా వినతి).

సృష్టిసౌందర్యం, శాస్త్రవిజ్ఞానం, సనాతనధర్మం - వీటి త్రివేణీ సంగమం డా. రామశాస్త్రిగారి కావ్యఖండిక 'అక్షరాంజలి'. ఈ పుస్తక ముఖచిత్రం కవి హృదయానికి దర్పణం. అంతరిక్షానికి 'అక్షరాంజలి' సుందర సుమాంజలి. పాఠకుల అభిరుచులు వేరుగా ఉండటం సహజం - కొందరికి వైజ్ఞానిక విషయాలపై మక్కువ ఎక్కువగా ఉంటే మరికొందరికి సాహితీ పిపాస మెండు. ఈ రెండు పాఠక వర్గాల సమ్మితంగా 'అక్షరాంజలి' రూపుదిద్దుకొందని చెప్పవచ్చు. 'నా విన్నపం' విభాగంలో రచయిత ఆత్మశోధన చేసుకుంటూ ఆ పరమేశ్వరుని మార్గదర్శనం చేయమని అందమయిన కంద పద్యాల రూపంలో విన్నవించుకొన్నారు. ఈ పద్యాలలో ప్రస్తావించిన విషయాలు వయోభేదం లేకుండా అందరికీ వర్తిస్తాయి.




***అజ్ఞాతంబుగనుండెదు / విజ్ఞానంబును నిరతము వెదకుటకొరకై***
***అజ్ఞానము పోగొట్టెదు / 'జిజ్ఞాస'ను నిలువనిమ్ము జీవితమెల్లన్***

ఈ విన్నపం సార్వకాలీనం, సార్వజనీనం. ఈ లఘుకావ్యంలో ఇటువంటి మననం చేసుకొనవలసిన పద్యాలు ఎన్నో ఉన్నాయి. అధ్యాపకులు ముఖ్యంగా 'నీ విలాసం' 'నా విన్నపం' భాగాల పద్యాలను నేటి విద్యార్థులకు బోధించి విద్యార్థులలో జ్ఞానసముపార్జన సంపుష్టి చేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. ఆ దిశగా మన రెండు రాష్ట్రాల విద్యాశాఖాధికారులు ఈ గ్రంథంలో కొన్ని పద్యాలను ఎంపిక చేసి పాఠ్యాంశాలుగా చేర్చే విషయాన్ని తప్పక పరిశీలించమని నా విజ్ఞప్తి.

ఈ చింతనాత్మక చిన్న పొత్తాన్ని **మిసిమి** పాఠకులు సాదరంగా స్వాగతిస్తారని ఆశిస్తున్నాను.

***'అక్షరాంజలి'*** *- రచయిత డా. ఎ.ఎస్. రామశాస్త్రి (అనామకుడు), పేజీలు: 54, వెల: అమూల్యం.*

*అపరాజిత పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం. 401, బ్లాక్ 3, మైహోమ్ విహంగ, గచ్చిబౌలి, హైదరాబాద్-32.*

For Free Circulation: asramasastri.com / books / aksharanjali.pdf., https://kinige.com/book/aksharanjali.

రాయవరపు సత్యనారాయణ
ముంబై/కాకినాడ. ఫోన్: 9391429717.